క్లుప్తంగా

బీజేపీతోనే దేశాభివృద్ధి సాధ్యం

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి తారానగర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకులు ఎం.రవికుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో యువకులు బీజేపీలో మంగళవారం రాత్రి చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి రవికుమార్‌యాదవ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశాభివృద్ధికి ప్రధాన మంత్రి నరేంద్రమోదీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో భారీగా బీజేపీలో చేరుతున్నారన్నారు.

కేలెండర్ ఆవిష్కరణ



రాయదుర్గం: రాయదుర్గంలోని ఊరపోచమ్మ ఆలయంలో ఉగాది ఉత్సవాలు బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన సంవత్సర ఆరంభాన్ని పురస్కరించుకొని రూపొందించిన కేలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకుముందు ఆలయంలో ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం భక్తులందరికీ ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఆలయ నిర్వాహకులు శ్యామ్లెట్ గణేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు నరేశ్, నర్సింహ, పాండు, సంజీవ, నర్సింహరాజు, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

గాలిదొడ్డిలో చలివేంద్రం ప్రారంభం



రాయదుర్గం: గాలిదొడ్డిలోని అంబేద్కర్ గాలిదొడ్డి డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం ఈ చలివేంద్రాన్ని గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసవి కాలం సమీపిస్తుండడంతో ప్రజల దాహార్తిని తీర్చేవిధంగా చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. సీనియర్ నాయకులు రమేష్, కృష్ణ, నర్సింహ్మ, బాలకృష్ణ, లక్ష్మణ్ పాల్గొన్నారు.

సందడిగా గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డులు



అవార్డులు అందజేస్తున్న మాజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా

గచ్చిబౌలి: రత్నదీప్ గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డ్స్–2023 అవార్డులను పంపిణీ చేశారు. బుధవారం గచ్చిబౌలిలోని బొటానికా క్లబ్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ టూరిజం, ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఆఫ్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రత్నదీప్ గ్రాండ్ క్వీన్స్ లీడర్ షిప్ అవార్డులను మాజీ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అజయ్ మిశ్రా పంపిణీ చేశారు. వివిధ రంగాలలో ప్రతిభావంతులైన 71 మంది మహిళలకు అవార్డులను అందజేశారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రేమించిన అమ్మాయితో పెళ్లి కాకపోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామచంద్రాపురం పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రామచంద్రాపురం పట్టణంలోని శ్రీ సాయినగర్ కాలనీకి చెందిన హేమచంద్రకుమార్(25)ఓ ప్రైవేట్ కంపనీలో ఉద్యోగం చేస్తున్నాడు. గత కొంత కాలంగా అతను ఓ అమ్మాయిని ప్రేమిస్తున్నాడని తల్లిదండ్రులకు చెప్పడంతో వారు అమ్మాయి తల్లిదండ్రులతో మాట్లాడారు. పెళ్లికి అమ్మాయి కుటుంబ సభ్యులు నిరాకరించడంతో హేమచంద్రకుమార్ మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలోనే ఆయన మంగళవారం రాత్రి డ్యూటీకి వెళ్లి వచ్చాడు. బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. దీన్ని గమనించిన మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్ ఏటీఎం.. నిరుపయోగం

- లక్షలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఏటీఎంలు వృథా
- దుమ్ము,ధూళితో నిండిన వాటర్ ఏటీఎంలు
- వేసవి ప్రారంభమైనా పట్టించుకోని అధికారులు



చందానగర్‌లోని సర్కిల్ -21 కార్యాలయం వద్ద సర్వీస్ రోడ్డులో ఏటీఎం సెంటర్

మియాపూర్ : వివిధ ప్రాంతాల నుంచి వచ్చే బాటసారులు వేసవిలో దాహార్తితో అల్లాడుతుంటారు. అలాంటి వారికి స్వచ్ఛమైన తాగునీటిని తక్కువ ధరకే అందించేందుకు ఐదేళ్ల క్రితం జీహెచ్ఎంసీ వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసింది. ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందించడానికి ఏర్పాటు చేసిన వాటర్ ఏటీఎంలు ప్రస్తుతం అలంకార ప్రాయంగా మారాయి. వాటర్ ఏటీఎంల ప్రారంభ సమయంలో అధికారులు, ప్రజాప్రతినిధులు కనబరిచిన హడావుడి ఆ తరువాత కనబరచడం లేదని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఏటీఎంల నిర్వహణ చూసే నాథులే కరువయ్యారని దుమ్ము, ధూళి, గ్లాసులు తుప్పు పట్టి అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నా పట్టించుకోవడం లేదంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చందానగర్‌లో జీహెచ్ఎంసీ సర్కిల్–21 కార్యాలయం వద్ద సర్వీస్ రోడ్డులో ఓ ఏటీఎంను ఏర్పాటు చేయగా చందానగర్‌లోని పీజేఆర్ స్టేడియం వద్ద మరో ఏటీఎంను ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేశారు. ఒక్కొక్క ఏటీఎంకు లక్షల రూపాయలు వెచ్చించారు.

- చందానగర్‌లోని రెడ్డి కాలనీ, శుభోదయ కాలనీ వద్ద వాటర్ ఏటీఎంలను ఏర్పాటు చేసి నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో గత కొన్ని రోజుల క్రితం వాటిని తొలగించారు. సరైన ప్రణాళిక లేకుండా ఏటీఎంలను ఏర్పాటు చేసి నిర్వహణ గాలికి వదిలేయడంతో లక్షల రూపాయల ప్రజాధనం వృతా అవుతోందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు.
- జీహెచ్ఎంసీ, జలమండలి సంయుక్తంగా వాటర్ ఏటీఎం సెంటర్లు ఏర్పాటు చేశారు. స్వీడన్ దేశానికి చెందిన జోసెఫ్ బి ఎకాలజికల్ వాటర్ సొల్యూషన్ సంస్థ సహకారంతో ఈ ఏటీఎం సెంటర్లను ఏర్పాటు చేశారు.
- వాటర్ ఏటీఎం సెంటర్ల వద్ద ఒక్క రూపాయికి అర లీటరు, రెండు రూపాయలకు లీటరు, ఐదు రూపాయలకు ఐదు లీటర్లు, పది రూపాయలకు 20 లీటర్ల స్వచ్ఛమైన తాగునీటిని ఈ ఏటీఎంల ద్వారా పొందవచ్చు. అయితే నిర్వహణ లోపంతో ఏటీఎంలు నిరుపయోగంగా మారాయి. ఏటీఎంలలో ఎప్పుడు నీరు ఉంటుందో తెలియక ప్రజలు ఆదరణ లేక వెలవెలబోతున్నాయి.

రంగనాథుడి ఉగాది ఉత్సవాలు ప్రారంభం



విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించిన ఆలయం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి కుటుంబసభ్యులు

రాయదుర్గం: గోపన్‌పల్లి పరిసరప్రాంత ప్రజల ఆరాధ్యదైవం రంగనాథుడి ఉగాది ఉత్సవాలు వైభవంగా ఆరంభమయ్యాయి. వేడుకల సందర్భంగా ఆలయం విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. పూలు, మామిడిఆకులు, వేపాకులతో ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. దీంతో పాటు ఆలయ ప్రవేశ ద్వారాల వద్ద భారీ ఎత్తున దేవుళ్ళ చిత్రపటాలకు రంగురంగుల విద్యుత్‌దీపాల తో అలంకరించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. రెండు రోజులపాటు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. ఆలయ అర్చకులు బుక్కాప్రభాకర్ పర్యవేక్షణలో ఆలయ కమిటీ సభ్యులు, గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణాన్ని ముస్తాబు చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆలయ ఉత్సవాల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి దంపతులు, కుటుంబసభ్యులతో కలిసి దర్శించుకున్నారు.

పొంగిన డ్రైనేజీ..రోడ్డంతా మురుగుమయం

మధురానగర్ ప్రధాన రోడ్డుపై అధ్వాన్న పరిస్థితి



మధురానగర్‌లో డ్రైనేజీ పొంగిపొర్లుతూ ప్రధాన రోడ్డుపైకి రావడంతో వాహనదారుల పరిస్థితి

రాయదుర్గం: డ్రైనేజీ పొంగింది. ప్రధానరోడ్డును ముంచెత్తింది. దీంతో వాహనదారులు దుర్వాసనతో ఇక్కట్లు పడుతూ రాకపోకలు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. గచ్చిబౌలి డివిజన్ మధురానగర్ ప్రధాన రహదారిపైకి మురుగునీరంతా మురుగుకాలువల నుంచి పొంగి పొర్లి ప్రధాన రోడ్డుపైకి చేరడంతో వాహనదారులు, పాదచారులు ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించాల్సి వచ్చింది. నగరం నుంచి ఔటర్‌రింగురోడ్డు, ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, ఐటీకారిడార్, నార్సింగి, ఖాజాగూడ, నానక్‌రాంగూడ, గౌలిదొడ్డివెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ రోడ్డుకు నిత్యం ఎంతో ప్రాధాన్యత నెలకొంది. దీంతో తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు వాహనాల రాకపోకలతో ఈ రోడ్డు ఎప్పుడూ కిటకిటలాడుతూ ఉంటుంది. ఇలాంటి ప్రాధాన్యత కలిగిన రోడ్డుపైకి మురుగునీరంతా వచ్చి చేరి రాకపోకలకు ఇక్కట్లు కలిగిస్తున్నా....దుర్వాసన వెదజల్లుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే స్పందించి వెంటనే మురుగునీరు ప్రధాన రోడ్డుపైకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా డ్రైనేజీ వ్యవస్థ పొంగకుండా తగిన చర్యలు అవసరమని వారు కోరుతున్నారు. డ్రైనేజీ వ్యవస్థ 20 ఏళ్ళ క్రితం నిర్మాణం చేయగా అప్పటి పరిస్థితులకు అనుగుణంగా నిర్మాణం చేశారని, అప్పటికీ, ఇప్పటికీ ఇళ్ల సంఖ్య పెరగడంతో మురుగుకాలువలను ఆధునీకరించడంతోపాటు విశాలంగా మార్చాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఉత్సాహంగా ఉగాది పంచాంగ శ్రవణం




టెలికామ్‌నగర్‌లోని సాయిదత్తగణపతి దేవాలయంలో పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయదుర్గం: ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం రాత్రి పంచాంగ శ్రవణం సాగింది. ఏడాది పొడవునా అన్ని రంగాల ప్రగతి, ఇతర అంశాలను అర్చకులు వినిపించారు. రాశుల వారిగా ఉన్న వివరాలను భక్తులకు వివరించారు. టెలికామ్ నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో ఆలయ అర్చకులు వీవీవీఎస్‌శర్మ ఆధ్వర్యంలో ఆలయ నిర్వాహకులు రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి పర్యవేక్షణలో పంచాంగ శ్రవణం వినిపించారు. అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు

పటాన్‌చెరు టౌన్: వేసవి నేపథ్యంలో ఏర్పాటు చేసే చలివేంద్రాలు బాటసారుల దాహార్తిని తీర్చేందుకు ఎంతగానో ఉపకరిస్తాయని ఎంఎస్‌ఆర్ యువసేన సభ్యుడు శివరెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఐనోల్ గ్రామంలో ఎంఎస్‌ఆర్ యువసేన ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌ఆర్ యువసేన సభ్యులు హర్షవర్ధన్ రెడ్డి, జంగయ్య, మోహన్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం కమిటీ ఎన్నిక



ప్రమాణ స్వీకారం చేస్తున్న సంఘం సభ్యులు

జిన్నారం(పటాన్‌చెరు): గుమ్మడిదల గ్రామ రైతుసంఘం నూతన కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా మోహన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా సంజీవరెడ్డి, ఆనంద్, మల్లేశ్, ప్రధాన కార్యదర్శిగా భాస్కర్, కోశాధికారిగా సదానందరెడ్డిలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేసింది. రైతుల సంక్షేమానికి తన కృషి చేస్తానని మోహన్‌రెడ్డి చెప్పారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు బారికేడ్లు



ఏఐజీ ఆస్పత్రి యాజమాన్యం అందించిన బారికేడ్లు

రామచంద్రాపురం(పటాన్‌చెరు): తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందు ఏఐజీ ఆస్పత్రి యాజమాన్యం 24 బారికేడ్లను బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా తెల్లాపూర్ నైబర్‌హుడ్ అసోసియేషన్ అధ్యక్షుడు ఈశ్వర్‌గారి రమణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కొందరు స్థానికులు తమ దృష్టికి తెచ్చారన్నారు. గత కొద్ది రోజులుగా తెల్లాపూర్ రేడియల్ రోడ్డుపై జరిగిన ప్రమాదాలను దృష్టిలో ఉంచుకొని తాము 24 బారికేడ్లను అందజేశామన్నారు.


'నా ఫ్లాట్‌ను కిరాయికిచ్చి బెదిరింపులకు పాల్పడుతున్నారు'

- ఇద్దరు వ్యక్తులపై పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

భాగ్యనగర్‌కాలనీ: తనకు చెందిన అపార్టుమెంట్ ఫ్లాట్‌లో ఇతరులకు కిరాయికి ఇచ్చి బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులపై బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం కూకట్‌పల్లికి చెందిన సీహెచ్.బాలేష్ జి వాసవీ దగ్గర సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. బాలేష్ యజమానురాలు ప్లాట్ నం.40, సర్వే నం.116/ఎ, వివేకానందర్‌నగర్ కాలనీ తీక్షా రెసిడెన్సీలో మూడు ప్లాట్లకు డవలప్‌మెంట్ అగ్రిమెంట్ చేసుకున్నారు.

- 2022 డిసెంబర్ 24వ తేదీన రిజిస్టర్ సేల్ డీడ్, గిఫ్ట్ డీడ్ పొంది యాజమాన్యపు హక్కులను పొందారు. అయితే తన యజమానులకు తెలియకుండా శంకర్ అనే వ్యక్తి రెండు ప్లాట్లను అక్రమంగా ఇతరులకు ఇచ్చి అద్దె వసూలు చేస్తున్నాడు. మరో ప్లాట్‌లో ఉడ్ వర్కు చేయిస్తున్నాడు. తన యజమానురాలి ప్లాట్‌లోకి వచ్చి అద్దె వసూలు చేసిన విషయమై శంకర్‌ను నిలదీయగా తాను గొట్టిముక్కల పద్మారావు అనుచరుడినని సుదర్శన్ ద్వారా బెదిరింపులకు పాల్పడ్డాడు.
- అపార్టుమెంట్ పరిసరాలకు మరోసారి రాకూడదని వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కొంటారని హెచ్చరించినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన యజమానురాలి ఫ్లాట్‌లో ఇతరులను పెట్టించి అక్రమంగా అద్దె వసూలు చేస్తున్న శంకర్, పద్మారావు, ఆయన అనుచరుడు సుదర్శన్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కూకట్‌పల్లి పోలీసులకు బాలేష్ ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



ఆదర్శనగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలో ఆదర్శనగర్‌లో రూ. 40 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ప్రభుత్వ విప్ అరికెపూడి గాంధీ స్థానిక కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్‌తో కలిసి మంగళవారం రాత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలు, బస్తీల అభివృద్ధికి తాము శాయశక్తులా కృషి చేస్తామన్నారు. మౌళిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నట్లు వివరించారు. ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఏఈ సునీల్, కాలనీ అధ్యక్షులు రామస్వామియాదవ్ పాల్గొన్నారు.

నిరుపేదలకు అండగా ఉంటాం



సరుకులు పంపిణీ చేస్తున్న శ్రీనివాస్‌గౌడ్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): పట్టణంలోని నిరుపేదలకు నీలం మధు ముదిరాజ్ యువసేన ఆధ్వర్యంలో బుధవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యువసేన నాయకులు కిషోర్, రవికుమార్‌లు మాట్లాడుతూ నియోజకవర్గంలోని నిరుపేదలకు యువసేన ఆధ్వర్యంలో ప్రతినెలా కొన్ని నిరుపేద కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పృథ్వీ, శ్రీకాంత్, విష్ణుయాదవ్, మహేందర్, పటేల్ పాల్గొన్నారు.

శివనాగులుకు ఉగాది పురస్కారం



మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న శివనాగులు

జిన్నారం(పటాన్‌చెరు): బొంతపల్లిలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామి దేవాలయంలో ప్రధాన అర్చకుడిగా విధులు నిర్వర్తిస్తున్న మడపతి శివనాగులు ఉగాది పురస్కారానికి ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతులమీదుగా శివనాగులు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా శివనాగులు మాట్లాడుతూ 40ఏళ్లుగా వీరభద్రస్వామి సన్నిధిలో అర్చకుడిగా పనిచేస్తున్నానని, ప్రభుత్వం తరపున ఉగాది పురస్కారం అందుకోవటం సంతోషంగా ఉందన్నారు.

గాయత్రికి 'ఉత్తమ గళ మహిళ' పురస్కారం



గాయత్రికి పురస్కారం అందిస్తున్న మధుసూదనాచారి

సనత్‌నగర్: ప్రముఖ డబ్బింగ్ కళాకారిణి, తన గళంతో రైల్వే సమాచారం అందించే వ్యాఖ్యత గాయత్రి 'ఉత్తమ గళ మహిళ' పురస్కారం అందుకున్నారు. ఆకృతి సంస్థ ఆధ్వర్యంలో బేగంపేట కుందన్‌బాగ్‌లో నిర్వహించిన ఉగాది, మహిళా దినోత్సవ వేడుకల్లో మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి చేతుల మీదుగా ఆమె పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ.. సమాజహితాన్ని కాంక్షించే వారిని గుర్తించి సత్కరించడం ఎంతో అవసరమని, ఇది ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. గాయత్రి గత మూడు దశాబ్దాలుగా డబ్బింగ్ కళాకారిణిగా ఎన్నో సినిమాలు, సీరియల్స్‌తో పాటు రైల్వేకు తన మధుర గాత్రాన్ని అందించడం ఎంతో అభినందనీయమన్నారు. మహిళా దినోత్సవాలు జరుపుకుంటున్న ఈ సమయంలో ప్రతిభావంతురాలైన మహిళను సత్కరించడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానన్నారు. సినీ, టీవీ నటుడు అశోక్‌కుమార్ మాట్లాడుతూ.. గాయత్రి లాంటి ప్రతిభ గల ఆర్టిస్టులను గుర్తించి సత్కరిస్తే వారు ఆ రంగంలో మరింతగా రాణించగలుగుతారన్నారు. ఈ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ వాసవీ క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు కొత్త వెంకటేశ్వరరావు, ఆకృతి సుధాకర్, విశ్వకర్మ సంఘం అధ్యక్షుడు జగన్నాధచారి, ప్రొఫెసర్ జోగాచారి పాల్గొన్నారు.

యువత చూపు బీఆర్ఎస్ వైపు



గచ్చిబౌలి: యువత చూపు భారతీయ రాష్ట్ర సమితి(బీఆర్ఎస్)వైపు ఉందని ప్రభుత్వ విప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్, మాదాపూర్ డివిజన్‌కు చెందిన పలువురికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులకు యువత ఆకర్షితులవుతున్నారని చెప్పారు. మైనార్టీల సంక్షేమం కోసం కృషి చేస్తున్న దేశంలో ఏకైక ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మాదాపూర్ డివిజన్ అధ్యక్షులు ఎర్రగుడ్ల శ్రీనివాస్, శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు మారబోయిన రాజు పాల్గొన్నారు.

కూలిన చెట్టు.. రాకపోకలకు అంతరాయం

కూకట్‌పల్లి: ఇటీవల కురిసిన వర్షాల కారణంతో చెట్టుకూలి రోడ్డు మధ్యలో పడింది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. నాలుగు రోజులుగా సిబ్బందికి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోకపోవడంతో ఆరోగ్య రెడ్డి మిత్రులు కూలిన చెట్టు కొమ్మలను నరికి పక్కన వేసి రోడ్డును శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, హరినారాయణరెడ్డి, శ్రీనివాసరెడ్డి, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.



బాలాజీనగర్ డివిజన్‌లో చెట్టు కొమ్మలను తొలగిస్తున్న దృశ్యం

వీధి కుక్కలతో తప్పని ఇబ్బందులు



గాయపడిన మసీహుద్దీన్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): రామచంద్రాపురం, భారతినగర్ డివిజన్‌లలో వీధి కుక్కలతో ఇబ్బందులు తప్పడంలేదు. గత కొద్ది రోజుల క్రితం తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని విద్యుత్‌నగర్ కాలనీలో ఓ విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన అందరికీ తెలిసిందే. తాజాగా భారతినగర్ డివిజన్ పరిధిలోని పాత ఎంఐజీ కాలనీలో వీధి కుక్కల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. అవి వాహనదారుల వెంట పడటంతో వారు ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డుపై వెళ్తున్న వాహనదారులపై వెంట పడి దాడి చేస్తున్నాయి. దీంతో వారు అదుపు తప్పి ప్రమాదాలకు గురై గాయాలపాలవుతున్నారు. వీటి కారణంగా నిత్యం ఏదో ఒక చోట ప్రమాదం జరుగుతూనే ఉన్నాయి. వీధి కుక్కలను నియంత్రించడంలో సంబంధిత అధికారులు విఫలం చెందుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఎంఐజీ కాలనీకి చెందిన చిరు వ్యాపారి మసీహుద్దీన్ తన వాహనంపై వెళ్తుండగా వీధి కుక్కల కారణంగా అదుపు తప్పి వాహనంపై నుంచి పడి గాయాలపాలయ్యాడు. ఈ సంఘటనలను దృష్టిలో ఉంచుకొని అధికారులు ఇప్పటికైనా స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.

కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శనకు ఆదరణ

మోతీనగర్: మోతీనగర్ కమ్యూనిటీహాల్‌లో గత నెల రోజుల నుంచి కొనసాగిన కళాసిల్క్ చేనేత హస్తకళ ప్రదర్శన గురువారంతో ముగియనుంది. ఈ మేళాలో ధర్మవరం, వెంకటగిరి, కలంకారి, ఉప్పాడ, అస్సాం వంటి చీరలతో పాటు జమ్ము కాశ్మీర్ ఎంబ్రాయిడరీ చీరలు మెటీరియల్స్ ప్రింటెండ్ శారీలు, చందేరి వంటి ఎన్నో రకాల చీరలు అందుబాటులో ఉన్నాయి. అదే విధంగా గృహోపకరణాలు, కొండపల్లి బొమ్మలు ఉన్నాయి. ఈ మేళా ప్రతి రోజు 10.30 నుంచి రాత్రి 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. దేశంలోని వివిధ రాష్ట్రాల్లో చేనేత కళాకారులు తయారు చేసిన ఎన్నో రకాల వస్త్రాలు గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయని ఈ అవకాశాన్ని పెన్షన్ అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

గణేశ్‌గడ్డ దేవస్థానం కిటకిట



పటాన్‌చెరుటౌన్: రుద్రారంసమీపంలోని గణేశ్‌గడ్డ దేవస్థానం బుధవారం భక్తులతో కిటకిటలాడింది. ఉగాది పండగ నేపథ్యంలో స్వామివారిని దర్శించుకోవడానికి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు సంతోష్ జోషి, జగదీశ్వర్‌స్వామి, చంద్రశేఖర్, సతీశ్, అయ్యప్పలు తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశామని ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి తెలిపారు. నిత్యాన్నదానం కూడా కొనసాగిందన్నారు.